క్లుప్తంగా

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



ఎస్టీ రాజాపురంలో స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ వెంకటరత్నం

రంగంపేట: ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేయాలని ఈవోపీఆర్డీ వెంకటరత్నం తెలిపారు. ఆయన శనివారం ఎస్టీ రాజాపురంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఉదయం 6 గంటలకే ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ ప్రారంభించాలన్నారు. తడి, పొడి చెత్త పద్ధతిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

హైజిన్ ఎడ్యుకేషన్‌పై సదస్సు

బిక్కవోలు: పందలపాకలోని పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐటీసీ సంస్థ ఆధ్వర్యంలో బాలికలకు హైజిన్ ఎడ్యుకేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీసీ సంస్థ ప్రతినిధులు బాలశ్రీ లక్ష్మి, రమ్యశ్రీ మాట్లాడుతూ 8, 9, 10 తరగతుల విద్యార్థినుల ఆరోగ్యం, ఎదుర్కొనే సమస్యలు, తీసుకోవాల్సిన ఆహారం, పాటించాల్సిన నియమాలను వివరించారు.

పూజితకు సత్కారం



చిన్నం పూజితను సత్కరిస్తున్న ప్రముఖులు

బిక్కవోలు: కొంకుదురు గ్రామానికి చెందిన చిన్నం పూజితను శుక్రవారం రాత్రి ఆదిత్య విద్యాసంస్థల వేడుకల్లో ఘనంగా సత్కరించారు. సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లో పూజిత విశేషంగా రాణించింది. బెంగళూరుకి చెందిన హాష్ కంపెనీలో ఏడాదికి రూ.52 లక్షల వేతనంతో ఉద్యోగం సాధించింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి జి.మామిడాడలోని వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, ప్రముఖ నేత వైద్యుడు తేతలి సత్యనారాయణరెడ్డి, ఆదిత్య సంస్థల అధినేత, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి, నల్లమిల్లి శృతి రెడ్డి సత్కరించారు.

నేడు ఐఎఫ్‌టీయూ విలీన సభ

మధురపూడి: రాజమహేంద్రవరంలో చందా సత్రంలో ఆదివారం ఐఎఫ్‌టీయూ రాష్ట్ర స్థాయి విలీన సభ నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన శనివారం కోరుకొండలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమాలను తీవ్రతరం చేసేందుకు సభ నిర్వహిస్తున్నామన్నారు. దీనికి ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షులు సాదినేని వెంకటేశ్వర్లు, జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, రాష్ట్ర కార్యదర్శి మరుకుర్తి ఏసు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.మోహన్ పాల్గొంటారన్నారు. ముందుగా ఆనం కళాకేంద్రం నుంచి చందాసత్రం వరకూ ప్రదర్శన నిర్వహిస్తామన్నారు.

నేడు విగ్రహాల ప్రతిష్ఠోత్సవం



నూతన విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

పెదపూడి: పెదపూడి గ్రామంలో పునర్నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠోత్సవం ఆదివారం ఉదయం 11.20 గంటలకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. దీనిలో భాగంగా రెండు రోజుల నుంచి సంకల్ప పూజల్లో జరుగుతున్నాయి. ఆ మేరకు శనివారం నూతన విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు.

యువతకు శిక్షణ

రాజానగరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు టైలరింగ్, కంప్యూటర్ వర్క్‌లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని ఆ సంస్థ సమన్వయాధికారి గండి సురేష్ తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని స్కిల్ హబ్‌లో జరిగే ఈ శిక్షణకు పదో తరగతి ఉత్తీర్ణులైన 18 నుంచి 45 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు పనివేళలో నేరుగా సంప్రదించాలని లేకుంటే 90636 48365 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

బంగారం చోరీ

కంబాలచెరువు: స్థానిక ఆల్కాట్ గార్డెన్స్ ప్రాంతంలో బంగారం చోరీకి గురైన సంఘటనపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. చెల్లివారి వీధికి చెందిన ఎలగదూరి శేషారత్నం గత నెల 26వ తేదీన కొత్తపేటలోని బంధువుల ఇంటికి పెళ్లికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి, అందులో ఉంచిన 18 గ్రాముల బంగారం మాయమైంది.

కన్నుపడితే కబ్జా

- అక్రమణకు గురవుతున్న పాత ఎన్‌హెచ్
- బడ్డీలను ఏర్పాటు చేస్తున్న వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు
- ప్రారంభోత్సవాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు



రాజానగరం పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న జెడ్పీ బంగ్లా ప్రహరీని ఆనుకుని జరుగుతున్న ఆక్రమణలు

రాజానగరం: నియోజకవర్గ కేంద్రమైన రాజానగరం ఆక్రమణలకు అడ్డాగా మారింది. పేరుకు తగ్గట్టుగా అభివృద్ధికి నోచుకోకపోయినా, ఆక్రమణలకు మాత్రం అడ్డూ అదుపు లేకుండా పోతోంది. వాటిని నిరోధించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. ఓట్ల రాజకీయాలతో ప్రజాప్రతినిధులు వాటిని ప్రారంభోత్సవాలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బక్కచిక్కిన రోడ్డు

గ్రామంలో ప్రధాన రహదారిగా ఉన్న పాత జాతీయ రహదారి ఇష్టానుసారంగా జరుగుతున్న ఆక్రమణలతో కుచించుకుపోతోంది. ఈ రోడ్డుకు ఇరువైపులా మేజర్ సీసీ డ్రైనేజీ ఉంది. దీనికి ఇరువైపులా పోలీసు శాఖ, జిల్లా ప్రజాపరిషత్, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన స్థలాలు ఉండటంతో గ్రామంలో వ్యాపార కార్యకలాపాల విస్తరణకు అవకాశం లేకుండా పోయింది. ఆయా శాఖలు వారి స్థలాలలో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తే ఈ రోజు రాజానగరం రూపే వేరే విధంగా ఉండేదనేది అందరికీ తెలిసిన విషయమే. ఆయా శాఖల పరంగా అభివృద్ధి జరగకపోవడంతో రహదారిని ఆనుకుని ఉన్న స్థలాలపై కొందరు వ్యాపారుల కన్ను పడింది. అవకాశం ఉన్నవారు తమకు నచ్చిన జాగాను కబ్జా చేసి, రాత్రికి రాత్రే ఇనుప రేకులతో తయారు చేసిన బడ్డీలను ఏర్పాటు చేసి, వ్యాపారాలు ప్రారంభిస్తున్నారు.

అద్దె బాధలు ఉండవు

సాధారణంగా వ్యాపారాల కోసం షాపులు తీసుకుంటే వాటికి అద్దె కట్టాలి. ప్రతి ఏటా యాజమానులు పెంచే అద్దెలను భరిస్తూ రావాలి. అదే ఈ విధంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని బడ్డీలలో వ్యాపారాలు చేస్తే అద్దె ఉండదు. యజమానుల బాధలుండవు. ఒకరకంగా సొంత స్థలంగానే గడిచినంత కాలం వ్యాపారాలను స్వేచ్ఛగా చేసుకోవచ్చు. ఈ విధంగా ఒకరిద్దరు ప్రారంభించిన ఆక్రమణలు ప్రస్తుతం 45 వరకు పెరిగాయి.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైపు ఉన్న ఆక్రమణలు

పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన బాధ్యత **ప్రతి ప్రభుత్వ ఉద్యో**గిపైనా ఉంది. అయితే **రాజానగరంలో ప్రభు**త్వ స్థలాలను ఆక్రమించుకుని **దుకాణాలు** పెడుతుంటే అధికారులు **పట్టించుకోవడం లేదు**. ఆక్రమంచి ఏర్పాటు **చేసిన దుకాణాలకు** ప్రజాప్రతినిధులు **ప్రారంభోత్సవం చేయడం** మరింత విశేషం. స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆనుకుని జిల్లా ప్రజా పరిషత్ బంగ్లా ఉంది. ఈ ప్రాంతంలో రెండింటికీ మధ్య ఉన్న సరిహద్దులో సిమెంటు దిమ్మ కట్టి, బడ్డీ పెట్టినా ఎవ్వరూ అడ్డుకోలేదు. మన ప్రాంతంలోకి రాలేదుకదా అని పోలీసులు వదిలేశారు. ఇక జెడ్పీ అధికారులు స్థానికంగా ఉండరు. ఈ విధంగా అధికారులు చూపుతున్న నిర్లక్ష్య వైఖరులు ఆక్రమణదారులకు వరాలుగా మారుతున్నాయి.

లైసెన్సుల మంజూరు

ఆక్రమణ దారులకు పంచాయతీ అధికారులే లైసె**న్సులు మంజూరు చేయ**డం విశేషం. సాధారణంగా ఇటువంటి వాటికి రోజువారీ ఆశీలు చెల్లించాలి. ఆ విధంగా రోజుకు రూ.20 నుంచి రూ.50 వరకూ కట్టాలి. కానీ ఆక్రమణదారులకు ఆశీల బెడద లేకుండా పంచాయతీ అధికారులే ఈ లైసెన్స్ విధానంతో స్వేచ్ఛ ఇస్తున్నారు. ఒక్కో దుకాణానికి ఏడాదికి రూ.500 నుంచి రూ. వెయ్యి వరకు కట్టించుకుని లైసెన్స్‌లిస్తున్నారు. అలాగే ఈ దుకాణాలకు విద్యుత్ ఇచ్చేందుకు కూడా ఎన్‌ఓసీలు జారీ చేయడం విచిత్రం. పంచాయతీలిచ్చిన ఎన్‌ఓసీలతో విద్యుత్ శాఖ వెంటనే విద్యుత్ కనెక్షన్ మంజూరు చేసేస్తోంది. అయితే ఇదే గ్రామంలో సాయిబాబా గుడి వెనుక ఉన్న జగనన్న కాలనీలో ఇళ్లు కట్టుకున్న లబ్ధిదారులకు మాత్రం కలెక్టర్ చెప్పినా విద్యుత్ శాఖ కనెక్షన్లు మంజూరు చేయలేదు. అదేమంటే వాటికి సంబంధించిన కేసు కోర్టులో ఉందనే కుంటి సాకుతో రాజకీయ ఒత్తిడితో విషయాన్ని దాటవేశారు.

లక్ష్మణరేఖను దాటేస్తున్నారు

గ్రామంలో ప్రధాన రహదారిగా ఉన్న పాత ఎన్‌హెచ్‌కి ఇరువైపులా మేజర్ సీసీ డ్రైనేజీలు ఉన్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన పంచాయతీ, మండల ప్రజాపరిషత్, పోలీసు శాఖల అధికారులు ఆయా ప్రాంతాలలోని వ్యాపారులు రహదారి పైకి రాకుండా వీటిని లక్ష్మణ రేఖగా చూపి, చర్యలు తీసుకునేవారు. గత కొన్నేళ్లుగా ఆ విధమైన చర్యలు తీసుకునే వారు లేకపోవడంతో లక్ష్మణరేఖగా ఉన్న సీసీ డ్రైనేజీనే కాదు, ప్రధాన రహదారిని కూడా మింగేస్తున్నారు.

పెరిగిన ఆక్రమణలు

ఇప్పటికే జెడ్పీ బంగ్లా చుట్టూ ఆక్రమణలు పెరిగిపోయాయి, వైద్య, ఆరోగ్య శాఖ, విద్యుత్ శాఖ, పంచాయతీల వైపు విస్తరిస్తున్న ఆక్రమణలను ఆయా శాఖల అధికారులు కూడా పట్టించుకోక పోవడం శోచనీయం. వీటిని ఇలాగే వదిలేస్తే పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా ఉన్న టీటీడీ కల్యాణ మండపం ముంగిట ప్రాంతాన్ని కూడా ఈ ఆక్రమణలు చుట్టేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే జెడ్పీ బంగ్లాకు ఎదురుగా ఉన్న చాకలి చెరువు చాలా వరకూ ఆక్రమణకు గురైంది.

అధికారులు చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులు ఏ ఒత్తిడికి లొంగిపోతున్నారో గానీ, ఆక్రమణలతో కుచించుకుపోతున్న రహదారిపై ప్రయాణించే వారు మాత్రం ఇబ్బందులకు గురవుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి. ఆక్రమణలను ప్రోత్సహించేలా పంచాయతీ నుంచి ఎన్‌ఓసీలు, విద్యుత్ శాఖ కనెక్షన్లు మంజూరు చేయకూడదు.

– సత్తి త్రిమూర్తులు, ప్రయాణికుడు

సెక్యూరిటీ బాండు

రోడ్డు పక్కన ఆక్రమణలకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసే సమయంలో వారి నుంచి సెక్యూరిటీ బాండు తీసుకుంటాం. తదుపరి ఏ విధమైన అభ్యంతరాలు వచ్చినా ఇచ్చిన కనెక్షన్లను తొలగిస్తాం. దానికి అంగీకరిస్తేనే మంజూరు చేస్తామని ఆ బాండులో స్పష్టంగా పేర్కొనడం జరుగుతుంది.

– సుధాకర్, ఇంజినీర్, విద్యుత్ సబ్‌స్టేషన్, రాజానగరం

ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తా

గ్రామంలో ప్రధాన రోడ్డును ఆనుకుని పెరిగిపోతున్న ఆక్రమణల గురించి స్థానిక ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం. వారి ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

– ఎస్.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, రాజానగరం

పట్టుదలతో కృషి చేస్తే విజయం



పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో మాట్లాడుతున్న హెచ్ఎం పార్థసారథి

రంగంపేట: పట్టుదలతో కృషి చేస్తే విజయం సాధ్యమవుతుందని రంగంపేట ఉన్నత పాఠశాల హెచ్ఎం వి.పార్థసారథి అన్నారు. ఆ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ జీవితంలో ఎదగడానికి పదో తరగతి ఫలితాలే తొలి మెట్టు అన్నారు. మంచి మార్కులు సాధించడానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఆధునిక ఫ్యాషన్, సెల్ ఫోన్ మోజులో పడి జీవితాలను పాడు చేసుకోవద్దని హితవు పలికారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులందరికీ విద్యార్థులు జ్ఞాపికలను అందించి ఘనంగా సత్కరించారు.

అంగన్‌వాడీ సిబ్బందికి ఆటల పోటీలు



పరుగుపందెంలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది

బిక్కవోలు: బలభద్రపురంలోని ఎస్ఎస్‌బీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అంగన్‌వాడీ సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించారు. ఐసీడీఎస్ రంగంపేట ప్రాజెక్టు పరిధిలోని బిక్కవోలు మండలానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. ఈ నెల 8వ తేదీన జరిగే అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని సందర్భంగా కబడ్డీ, కోకో, వాలీబాల్, పరుగుపందెం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలోని సూపర్‌వైజర్లు ఏవీ కృష్ణకుమారి (బిక్కవోలు), శాంతిరత్నం కుమారి (ఊలపల్లి), యు.పద్మ (బలభద్రపురం) తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

మధురపూడి: కోరుకొండ మండలం నిడిగట్ల వికాస్ పార్మసీ కాలేజీ విద్యార్థినులకు శనివారం ఎస్సై శ్యామ్ సుందర్ ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, విజ్ఞానాన్ని పెంపొందించుకుని సమాజంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. దీనిలో భాగంగా పోలీసుస్టేషన్‌లో రిసెప్షన్, మహిళా రక్షక్, ఆర్టీఐ యాక్ట్, డయిల్ 112, ఎఫ్ఐఆర్, లాకప్, వీహెచ్ఎఫ్ కమ్యూనికేషన్ సెట్ తదితర వాటిని వివరించారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్యామ్ సుందర్

మహిళా పోలీసులకు వైద్య పరీక్షలు



మహిళా పోలీసుకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కడియం: ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా కడియం పోలీస్ స్టేషన్ మహిళా సిబ్బందికి కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రాథమిక వైద్య పరీక్షలు చేపట్టారు. రక్తపోటు, షుగర్ తదితర పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే మినర్వా స్కూల్లోని పదో తరగతి విద్యార్థినులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు ఏ విధంగా రాయవచ్చో వివరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎస్సైలు ధనలక్ష్మి ప్రసన్న, దుర్గాప్రసాద్, సిబ్బంది సురేష్‌బాబు, రమణ, అసోసియేషన్ నాయకులు బళ్లా శ్రీనివాసరావు, పి.దేవానందం, యు.ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజానికి కృషి

పెదపూడి: తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేసి, ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ సందర్భంగా పెద్దాడ గ్రామంలోని బీబీఆర్ కాలనీలో శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరుచేసే విధానాన్ని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ డొకుబుర్ర మీనాక్షి, బొడ్డు శ్రీనివాసరావు, సచివాలయం కార్యదర్శి మన్యం శ్రీనివాసు చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్కూల్ వార్షికోత్సవం

పెదపూడి: జి.మామిడాడలోని ఆదిత్య స్కూల్ 11వ వార్షికోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి ప్రముఖ నేత్ర వైద్యులు టి.సత్యనారాయణరెడ్డి, సీహెచ్ పూజిత సూర్యరాజేశ్వరి, రుడా చైర్మన్ బొడ్డు అనంత వెంకటరమణ చౌదరి, ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ ఎస్.శృతిరెడ్డి, కోఆర్డినేటర్ వి.రాజేష్ హాజరయ్యారు. ప్రిన్సిపాల్ వి.భవాని అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

చైతన్యరాజుకు కేంద్ర మంత్రి పరామర్శ



లక్ష్మీకాంతమ్మ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, తదితరులు



చైతన్యరాజును పరామర్శిస్తున్న చెల్లుబోయిన వేణు, కవురు శ్రీనివాస్

రాజానగరం: మాతృ వియోగంతో బాధపడుతున్న చైతన్య విద్యాసంస్థల చైర్మన్, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు)ను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ పరామర్శించారు. జీజీయూ క్యాంపస్‌లోని ఆయన నివాసానికి శనివారం వచ్చిన మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, లక్ష్మీకాంతమ్మ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు.

పలువురి పరామర్శలు

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ తదితరులు చైతన్య రాజు నివాసానికి వెళ్లి పరామర్శించారు. అమలాపురం ఎమ్మెల్యే ఎ.ఆనందరావు, 'నన్నయ' వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, పాండిచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు తాటిపాక మధు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సత్యనారాయణరాజుతో పాటు మాజీ మంత్రులు పినిపే విశ్వరూప్, నిమ్మకాయల చినరాజప్ప, మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మాజీ ఎమ్మెల్సీ ఎస్.శేషారెడ్డి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు పి.నాగేంద్ర, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణారెడ్డి

రాజానగరం: మండలంలోని సీతారామపురంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) పథకంలో చేపట్టిన రోడ్డు పనులను పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రామకృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యనివ్వాలని సూచించారు. ఆయన వెంట డీఈఈ దుర్గాప్రసాద్, ఏఈ సంపత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు సత్తిరాజుకు సత్కారం

బిక్కవోలు: పందలపాకలోని పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయుడు కొనాల సత్తిరాజును శనివారం ఘనంగా సత్కరించారు. పాఠశాల ఆవరణ నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం చిర్ల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తన స్నేహితుడు మాట కోసం 30 ఏళ్లుగా ఈ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. 17 ఏళ్ల క్రితం ఈ పాఠశాల నుంచి ఉద్యోగ విరమణ చేసినా, పాఠశాల అభివృద్ధిని తన బాధ్యతగా తీసుకుని సేవలు అందిస్తున్నారు. పూర్వ విద్యార్థులు, దాతలు సహకారంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు మధ్య వారధిగా వ్యవహరిస్తూ అనేక సేవలు అందిస్తున్నారని తెలిపారు.



సత్తిరాజు మాస్టారును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఇంటర్ పరీక్షలకు 564 మంది హాజరు



కోరుకొండ జూనియర్ కాలేజీ వద్ద విద్యార్థులు

మధురపూడి: కోరుకొండ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జనరల్ పరీక్షలకు సంబంధించి 455 మందికి 439 మంది, ఒకేషనల్ పరీక్షలకు 139 మందికి 125 మంది హాజరయ్యారు. రెండు విభాగాల్లోనూ కలిపి 30 మంది పరీక్ష రాయలేదు.

675 మంది విద్యార్థుల హాజరు

రంగంపేట: మండలంలోని రెండు ఇంటర్మీడియెట్ పరీక్షా కేంద్రాల్లో తొలి రోజు 675 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని చీఫ్ సూపరింటెండెంట్లు బి.హేమ, ఎస్.మాధురి తెలిపారు. ఏ కేంద్రంలో 375 మందికి 355 మంది, బి కేంద్రంలో 333 మందికి 320 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్



బూరుగుపూడిలో పింఛన్ లబ్ధిదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు పింఛన్ అందించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 2,35,345 మందికి రూ.102,04,19,500 పంపిణీ చేసినట్టు తెలిపారు. ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి తాతపూడి జాకబ్‌రాజు ఆమె వెంట ఉన్నారు.

94 శాతం పంపిణీ

పెదపూడి: మండలంలో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ 94 శాతం పూర్తయ్యిందని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి తెలిపారు. జి.మామిడాడ, రామేశ్వరం, రాజుపాలెం, పెదపూడి, గ్రామాల్లో పింఛన్ల పంపిణీని శనివారం ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు సూర్యలక్ష్మి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సాక్షిగా అబద్ధాల బడ్జెట్



మహ్మద్ ఆరీఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్

ప్రకాశం నగర్: కూటమి ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా అబద్ధాల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని, మైనారిటీ కేటాయింపుల ప్రసంగమంతా అబద్ధాలతోనే సరిపోయిందని మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ మహ్మద్ ఆరీఫ్ అన్నారు. జాంపేటలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ బడ్జెట్ ప్రసంగం ముస్లిం సమాజాన్ని తీవ్ర విస్మయానికి గురిచేసిందన్నారు. ఇమామ్, మౌజన్ల గౌరవ వేతనాలు చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రూ.ఐదు వేలు, రూ.మూడు వేలుగా ఉండేవన్నారు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇమామ్‌లకు రూ.పది వేలు, మౌజన్‌లకు రూ.ఐదు వేలు చేశారన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పది నెలల గౌరవ వేతనాలు బకాయిల కోసం అనేక మంది ముస్లింలు విజ్ఞప్తి చేయగా ఈ మధ్యనే ఆరు నెలల వేతనాలు విడుదల చేశారన్నారు. ఇంకా నాలుగు నెలల వేతనాలను కూడా సత్వరమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మసీదుల నిర్వహణ కోసం ప్రతి నెల రూ.5 వేలు అదనంగా ఇస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. ఆ ప్రకారం పది నెలల నిర్వహణ బకాయిలను రంజాన్ ప్రారంభం సందర్భంగా ప్రతి మసీదుకు రూ. 50 వేలు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.